## క్లుప్తంగా

### మనుబోలమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేకాలంకరణలో మనుబోలమ్మ

**మనుబోలు :** మనుబోలు పెద్ద చెరువు గట్టున వెలసిన గ్రామ దేవతలు మనుబోలమ్మ, నాగార్పమ్మలకు గ్రామస్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో వర్షాలు బాగా కురిసి పాడి పంటలతో కళకళలాడాలని కోరుకుంటూ అమ్మవార్లకు సలిపిండి, పానకాలు, పొంగళ్లను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించారు. అర్చకుడు ఫణీంద్రశర్మ గ్రామదేవతలకు ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

### రంగడి సన్నిధిలో గరుడోత్సవం నేడు

**నెల్లూరు(బృందావనం):** నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో గరుడోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నామని దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీదేవీ, భూదేవీ సమేత తల్పగిరి రంగనాథస్వామి, పెరియాళ్వార్లకు తిరుమంజనం, గరుడ, గజవాహనసేవలను నిర్వహించనున్నామని వివరించారు. భక్తులు తరలిరావాలని కోరారు.

### సమస్యలపై అర్జీలను అందజేయండి

**నెల్లూరు(బారకాసు):** వివిధ సమస్యలపై ప్రజలు తమ అర్జీలను అందజేయాలని అదనపు కమిషనర్ శర్మద ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనంలో అర్జీలను సోమవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం వరకు స్వీకరించనున్నామని చెప్పారు. కార్యక్రమానికి వివిధ విభాగాధిపతులు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

### పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**నెల్లూరు (టౌన్):** దర్గామిట్టలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో 2004 – 05 బ్యాచ్‌కు చెందిన హిందీ పండిట్ ట్రెయినింగ్ పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. నాటి స్మృతులను నెమరేసుకున్నారు. సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి, విశ్రాంత విద్యాశాఖ జేడీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించాలని వినతి



**నెల్లూరు(అర్బన్):** సచివాలయాల పరిధిలోని వార్డు అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని రాష్ట్ర స్థాయి అడ్మిన్ ఉద్యోగ సంఘ నేతలు సతీష్‌రెడ్డి, బాలు కోరారు. ట్రంక్‌రోడ్డు సమీపంలోని వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీస్ సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఆత్మీయ సమావేశంలో వారు మాట్లాడారు. తమ సేవలను గుర్తించి అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలకు జూనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నిబంధనల మేరకు ఇంక్రిమెంట్లు, ఇతర అలవెన్స్‌లను ఇవ్వాలని కోరారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ, జనరల్ సెక్రటరీ సీతారామ చైతన్య, నేతలు పాండు, పుట్టారావు, చిట్టిబాబు, ఆశదీప్, శేషుబాబు, రవి, రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### కాలువలకు మరమ్మతులు చేపట్టరూ..



**నెల్లూరు(దర్గామిట్ట):** సాగునీటి కాలువలకు మరమ్మతులు చేపట్టి రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడ్ని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు. ఈ మేరకు నగరంలోని ఆర్ అండ్ బీ అతిథిగృహంలో మంత్రిని ఎమ్మెల్యే ఆదివారం కలిశారు. ఇందుకూరుపేట మండలంలోని పల్లిపాడు వద్ద ధ్వంసమైన కరకట్టలు, రిటైనింగ్ వాల్స్‌ను నిర్మించాలని కోరారు. అదే విధంగా నియోజకవర్గంలో పలు సాగునీటి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. వీటిని పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

# సేంద్రియ సాగు.. లాభాలు బాగు

వ్యవసాయంలో రసాయన ఎరువుల వినియోగం వల్ల లాభాల కంటే నష్టాలే అధికంగా ఉంటాయి. భూమిలో పంటల ఎదుగుదలకు ఉపయోగపడే సూక్ష్మజీవులు చనిపోతాయి. భూమి సారం కోల్పోతుంది. పర్యావరణానికి కూడా హానికరం. ఈ ఉత్పత్తులను తీసుకోవడం వల్ల ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుంది. అదే సేంద్రియ సాగుతో ఇలాంటి నష్టాలు ఉండవు. నేల ఉత్పాదకత, భూసారం నిలకడగా ఉంటాయి. పంటలో నాణ్యత పెరుగుతుంది. పెట్టుబడులు తగ్గుతాయి. ఆరోగ్యకర ఉత్పత్తులు పొందవచ్చు.


రసాయనాలు లేకుండా సేంద్రియ మిశ్రమాన్ని తయారు చేస్తున్న రైతులు


సాగులో ఉన్న వరిపొలం

- రసాయన మందులతో పెట్టుబడి రెట్టింపు
- ప్రకృతి సేద్యంతో ఖర్చు ఆదా
- ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు

**కోవూరు :** కోవూరు నియోజకవర్గంలో సేంద్రియ పద్ధతిలో సుమారు మూడు వందల ఎకరాల్లో సాగు జరుగుతోంది. అందులో విడవలూరు మండలంలోనే అధికంగా సాగు చేస్తున్నారు. నీరు సమృద్ధిగా లభించే కోవూరు నియోజకవర్గంలో రైతులు పంటల సాగులో సేంద్రియ పద్ధతులను అవలంభిస్తున్నారు. సాధారణంగా వ్యవసాయంలో రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం ఎక్కువైంది. వాటి ధరలు ఎక్కువగా ఉండడంతో పెట్టుబడి రెట్టింపు అవుతోంది. భూమి నిస్సారం అవుతోంది. ఏటా దిగుబడులు కూడా తగ్గిపోతున్నాయి. దీని కారణంగా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఉంది. సేంద్రియ సాగుకు ప్రభుత్వాలు కూడా ప్రోత్సాహం అందిస్తున్నాయి.

**సేంద్రియ వ్యవసాయం వల్ల లాభాలు**

నేల, నీరు, వ్యవసాయ ఉత్పత్తులు కాలుష్యానికి గురికావు. సేంద్రియ ఎరువుల వినియోగం పెరగడం వల్ల మొక్కకు అవసరమైన ఉప సూక్ష్మపోషకాలు తగిన మోతాదుల్లో లభ్యమవుతాయి. చీడపీడల తాకిడి తగ్గుతుంది. ఆరోగ్యానికి, కాలుష్య నివారణకు దోహదపడుతుంది.

➡ నీరు పట్టి ఉండుకునే శక్తి పెరుగుతుంది. వేర్లు బాగా భూమిలోకి చొచ్చుకుని పోయే లక్షణం కలిగి ఉంటుంది. భౌతిక లక్షణాలు వృద్ధి చెందుతాయి. మొక్కకు పోషకాలు బాగా అందుబాటులోకి వస్తాయి. వ్యవసాయ సుస్థిరత పెరుగుతుంది. సురక్షిత ఆహారం లభిస్తుంది.

➡ ఆహారంలోకి విష పదార్థాలు ప్రవేశించే అవకాశం ఉండదు. ఖరీదైన పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం లేదు. నేల ఉత్పాదకత భూసారం పుష్కలంగా అందుతుంది. పంటలో నాణ్యత పెరుగుతుంది.

**యాజమాన్య పద్ధతులు**

సేంద్రియ వ్యవసాయానికి గోవుల పేడ, వేప సారం అవసరం. నేల కోతకు గురికాకుండా జాగ్రత్త పడాలి. నేల– నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలి. పంట మార్పిడి తప్పనిసరిగా పాటించాలి. అనువైన అంతర పంటలు వేయాలి. పచ్చిరొట్ట పైర్లకు, పచ్చి ఆకురొట్టకు ప్రాధాన్యం ఇవ్వాలి. వ్యవసాయ వ్యర్థాలను సమర్థవంతంగా ఉపయోగించడం కీలకం.

➡ పూర్తిగా కుళ్లిన సేంద్రియ ఎరువుల వాడకం, పరిశుభ్రమైన సాగు, సకాలంలో కలుపు నివారణ జరగాలి. సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు విరివిగా వాడడం ముఖ్యం. సాగునీటి యాజమాన్యంపై దృష్టి పెట్టాలి. రసాయనాలు వాడకుండా సహజ వనరుల ద్వారా భూసారాన్ని పెంపొందించుకోవాలి. జీవ నియంత్రణ పద్ధతులు, వృక్ష సంబంధ మందులకు ప్రాధాన్యం ఇవ్వాలి.

**ఎంతో ఉపయోగం**



సేంద్రియ సాగుతో అనేక ప్రయోజనాలు ఉండాలి. రసాయన ఎరువుల వాడకంతో భూమి సారం కోల్పోతుంది. దీనివల్ల దిగుబడి కూడా తగ్గిపోతుంది. కొన్నిసార్లు కనీసం పెట్టుబడి కూడా రాదు. అందువల్ల తక్కువ పెట్టుబడితో సాధ్యమయ్యే సేంద్రియ సాగుపై దృష్టి పెట్టాం.

– యాదగిరి మల్లికార్జున, విడవలూరు

**సాగు ఖర్చు తక్కువ**



సేంద్రియ సాగుతో నాలుగు మాసాలు పంటకాలం ఉంటుంది. ఎకరాకి మూడు పుట్ల దిగుబడి వస్తుంది. ఎకరకి రూ.15 వేల నుంచి రూ.20 వేలు వరకు సాగు ఖర్చు అవుతుంది. అదే రసాయన ఎరువులు వినియోగిస్తే రూ.40 వేలు అవుతుంది. ఖర్చు ఎక్కువ అవుతుండడంతో సేంద్రియ సాగుపై దృష్టి సారిస్తున్నా.

– వేటగిరి హర్ష, పటేల్ నగర్, విడవలూరు

**సేంద్రియ సాగుపై దృష్టి సారించాలి**

రసాయన ఎరువులతో భూమి సారం తగ్గిపోతుంది. రైతులు సేంద్రియ సాగుపై దృష్టి సారించాలి. పంట మార్పిడితో రైతులకు ఆర్థిక దన్ను ఉంటుంది. శాస్త్రవేత్త సూచనల మేరకు పురుగు మందులు వాడాలి. అప్పుడే భూమి సారవంతంగా ఉంటుంది.

– ఇందిరావతి, ఏఓ, కోవూరు

### ముత్తుకూరులో భారీ వర్షం


జలమయమైన కొత్తపాళెం రోడ్డు

**ముత్తుకూరు :** ముత్తుకూరు మండలంలో శనివారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దట్టమైన మబ్బులతో ఆదివారం ఉదయం నుంచి పట్టిన ముసురు సాయంత్రం వరకు కొనసాగింది. కాలనీల వీధుల్లో వర్షపునీరు చేరింది. రోజువారీ జీవనానికి అవరోధం ఏర్పడింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. వాతావరణం చల్లబడింది.

### విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

**పొదలకూరు :** మండలంలోని పొదలకూరు, ప్రభగిరిపట్నం, తాటిపర్తి, చాటగొట్ల, దుగ్గుంట, తోడేరు, వసంతోపు, విరువూరు, సబ్‌స్టేషన్ల పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శ్రీకాంత్ ఆదివారం తెలిపారు. ఆదురుపల్లిలో ఉన్న 132/133 కేవీ సబ్‌స్టేషన్‌లో రిపేర్లు చేస్తున్నందున ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

# చేనేతకు ప్రోత్సాహం కరువు


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు మన్నెం సతీష్

**ముత్తుకూరు :** చేనేత పరిశ్రమకు ప్రోత్సాహం కరువైందని, కులవృత్తిని విడిచిపెట్టి తమ పిల్లలను మంచి చదువులు చదివించాలని దేవాంగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మన్నెం సతీష్ అన్నారు. ముత్తుకూరు పంచాయతీలోని బలిజపాళెంలో ఆదివారం జరిగిన దేవాంగుల సమావేశంలో ఆయన పాల్గొని, ప్రసంగించారు. కష్టపడి చదివే పిల్లలకు మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. అసోసియేట్ అధ్యక్షుడు సజ్జ వెంకటసురేష్ మాట్లాడుతూ, జిల్లా దేవాంగ సంఘం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. కోశాధికారి కొండా మాధవయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటసుబ్బయ్య, ఏరాసి సుబ్బారావు, పిచ్చుక మునిశేఖర్ పాల్గొన్నారు.

# గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చిన్నారులు, ఆశ్రమ సభ్యులు

**ఇందుకూరుపేట :** మండలంలోని పల్లిపాడు గ్రామంలో ఉన్న పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ఆశ్రమ కమిటీ కో–కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో హిందూ, ముస్లిం, క్రైస్తవ, బౌద్ధ తదితర మతాలకు సంబంధించి ప్రార్థనలు జరిపారు. తొలుత ఆశ్రమంలోని గాంధీ విగ్రహానికి, స్థలదాత పొణకా కనకమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ సభ్యుడు గంపల మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.

# తల్లీబిడ్డల ఆరోగ్యానికి అభయం


వైద్య పరీక్షలు చేస్తున్న గైనకాలజిస్ట్ పద్మజ


గర్భిణికి పౌష్టికాహారం అందజేస్తున్న వైద్యాధికారులు

- ప్రతినెలా వైద్యపరీక్షలు తప్పనిసరి

**కోవూరు :** మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం వరకు ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలని బుచ్చి సీహెచ్‌సీ గైనకాలజిస్టు డాక్టర్ జి.పద్మజ అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో తల్లీబిడ్డల ఆరోగ్యం గురించి ఆమె ఆదివారం మాట్లాడారు. గర్భం దాల్చిన మహిళ తొలి నుంచి ఒకే ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. దీనివల్ల ఆ గర్భిణికి సంబంధించిన పూర్తి సమాచారం అందుబాటులో ఉంటుందన్నారు. అలాగే సీహెచ్‌సీలో మాతా శిశు సంరక్షణ కార్డులు కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డకు ఐదేళ్ల వయస్సు వరకు ఈ కార్డు వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. తల్లికి బిడ్డకు ఈ కార్డులో ప్రత్యేక ఐడీ నంబర్లు ఇస్తున్నారన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా చేయించుకోవాల్సిన వైద్య పరీక్షల సమయాలు వాటిలో పొందుపరుస్తారని వివరించారు. దీని ఆధారంగా వైద్య సేవలు పొందడం ద్వారా బిడ్డను ప్రసవించే నాటికి పూర్తి ఆరోగ్యంగా ఉండేలా చర్యలు చేపడుతారన్నారు. వీటితో పాటు ప్రధాన మంత్రి మాతృత్వ సంరక్షణ యోజన ద్వారా ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగే ప్రసవానికి ఆర్థిక సాయం అందించే వివరాలను కూడా అందులో పొందుపరుస్తారన్నారు. తొలి కాన్పులో సాధారణంగా తలెత్తే సమస్యల వివరాలు, బిడ్డకు ముర్రుపాలు, తల్లిపాలు ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కలిగించే అంశాలను కార్డులో ముద్రించి ఉంటారన్నారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహార వివరాలు, పిల్లలకు శారీరక మానసిక ఎదుగుల సంబంధించిన అంశాలను గుర్తించుకోవాలన్నారు. ప్రభుత్వ వైద్యంపై ప్రజలు నమ్మకం కలిగి ఉండాలన్నారు.

### మెగా వాటర్‌ప్లాంట్ పరిశీలన

**పొదలకూరు :** పట్టణానికి సమీపంలో చిట్టేపల్లి తిప్ప వద్ద ఉన్న మెగా వాటర్ ప్లాంట్‌ను జనసేన సర్వేపల్లి సమన్వయకర్త సురేష్‌నాయుడు ఆదివారం పరిశీలించారు. వాటర్‌ప్లాంట్ నిరుపయోగంగా మారిందని, దీనిని ఉపయోగంలోకి తీసుకుని రావాల్సిందిగా తెలిపారు. ఆయన వెంటన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

### పాముల హల్‌చల్


స్వర్ణాల చెరువులో పాము


తరుముతున్న చిన్నారులు

**బారాషహీద్ దర్గా ప్రాంగణంలోని స్వర్ణాల చెరువులో పాములు ఆదివారం కలకలం సృష్టించాయి. ఒక్కసారిగా ఇవి కనిపించడంతో చెరువలో స్నానమాచరించే భక్తులు భయభ్రాంతులకు గురయ్యారు. కొందరు చొరవ చూపి వీటిని తరిమారు. అధికారులు స్పందించి చెరువును పరిశుభ్రంగా ఉంచాలని పలువురు కోరుతున్నారు.**

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

# వ్యవసాయ పరిశోధనలు కనుమరుగు


పరిశోధన స్థానంలో నిర్మించిన నీటికుంట


శాస్త్రవేత్తలు సాగు చేస్తున్న కంది పంట

- నీటి లభ్యత లేక వర్షాధార పంటల సాగు
- నాణ్యమైన పంట దిగుబడులపైనే దృష్టి
- చిరుధాన్య పరిశోధనా స్థానంలో ఇదీ పరిస్థితి

**పొదలకూరు :** ఐదు దశాబ్దాల క్రితం పొదలకూరు ప్రాంత వరప్రసాదినిగా పేరు తెచ్చుకున్న చిరుధాన్య పరిశోధనా స్థానం ప్రస్తుతం పరిశోధనలు లేక వెలవెలబోతోంది. ఇక్కడ పరిశోధనలు జరగకపోవడానికి ప్రధాన కారణం నీటి లభ్యత లేకపోవడమే. ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో ఇక్కడి పరిశోధనా స్థానం పనిచేస్తుంది. పొదలకూరు పరిసర ప్రాంతాలైన రాపూరు, చేజర్ల, కలువాయి, సైదాపురం, మనుబోలు తదితర మండలాల్లో మెట్టపంటల సాగు అధికంగా ఉంటుంది. అపరాల సాగు ఉన్న ప్రాంతంలో మెట్ట వంగడాలపై పరిశోధనలతో పాటు, కొత్త వంగడాలను కనుగొనేందుకు ఇక్కడ పరిశోధనా స్థానాన్ని ఏర్పాటు చేశారు. అయితే నిర్దేశించిన లక్ష్యాలు కొంతవరకు నెరవేరినా తర్వాత పరిశోధనా స్థానం వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల నిర్వహణకే పరిమితమైంది. ఇక్కడ కొత్త వంగడాలపై పరిశోధనలు జరిగి సుమారు మూడు దశాబ్దాలు దాటింది. 13 ఎకరాల్లో పరిశోధన స్థానం ఉండగా, ప్రస్తుతం సజ్జ, కంది పంటల సాగు చేపట్టారు. వర్షాధారంగా మినుము, పెసర, మొక్కజొన్న, వేరుశనగ తదితర పప్పు ధాన్యాలను రైతుల క్షేత్ర సందర్శన, విత్తనాల కోసం ప్రతి ఏడాది పండిస్తారు. పరిశోధనా స్థానం ఏర్పాటు చేసిన తొలినాళ్లలో పొదలకూరు జొన్న పేరుతో కొత్త వంగడాన్ని కనుగొన్నారు. అయితే జొన్నసాగు కాలానుగుణంగా దాదాపుగా అంతరించిపోయింది. నిధుల లేమి, నీటి సౌకర్యం లేకపోవడం పరిశోధనలకు అడ్డంకిగా మారడంతో శాస్త్రవేత్తలు వ్యవసాయం చేసి నాణ్యత కలిగిన పంట దిగుబడులపైనే దృష్టి కేంద్రీకరిస్తున్నారు.

**పప్పుధాన్యాల సాగు**

పరిశోధనా స్థానంలో ఉన్న పొలంలో సీజన్ల వారీగా పంటల సాగు చేపడుతున్నారు. ఇందువల్ల రైతులకు క్షేత్రసందర్శన ద్వారా ఎరువులు, పురుగు మందులు తగిన మోతాదులో వినియోగించి అధిక ఫలసాయాన్ని దిగుబడి చేయడంలో మెళకువలు వివరిస్తున్నారు. దిగుబడి తగ్గినా నాణ్యమైన పంట దిగుబడి ఉండాలన్నది శాస్త్రవేత్తల ఉద్దేశం. అంతేకాక ఏజీ పాలిటెక్నిక్ కళాశాల పరిశోధనా స్థానంలో ఉండడం వల్ల విద్యార్థులు క్షేత్రస్థాయిలో వ్యవసాయంపై అవగాహన పెంచుకునేందుకు పంటల సాగు ఉపయోగపడుతోంది. గతేడాది విద్యార్థులకు కొంత పొలాన్ని కేటాయించి వారి ద్వారా సాగు చేపట్టి ఫలసాయం తీసి నిధులు సమకూర్చుకున్నారు. మినుము టీబీజీ 104, పీయూ 31, పెసరలో వరంగల్ 42 రకాలను సాగు చేశారు. ఈ రకం విత్తనాలు ప్రధానంగా పల్లాకు తెగులును తట్టుకోవడంతో పాటు, ఏ సీజన్‌లోనైనా పంటదిగుబడి అందుతుంది. మెట్టరైతుల వ్యవసాయానికి ఎంతగానో ఉపయోగపడే పరిశోధనా స్థానంలో నీటి లభ్యత సమస్యగా మారడంతో శాస్త్రవేత్తలకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇటీవల పరిశోధనా స్థానం పొలంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా వ్యవసాయ నీటి కుంటను నిర్మించి సాగుకు నీటిని వినియోగిస్తున్నారు. ఈ కుంట వర్షం కురిస్తే నిండి పంటలకు నీటిని అందించేందుకు ఉపయోగపడుతుంది.

**అవగాహన పెంచుకోవాలి**

ప్రధాన శాస్త్రవేత్త స్థానంలో బదిలీపై ఇక్కడికి వచ్చాను. ముందుగా అవగాహన పెంచుకుని తర్వాత పంటల సాగుపై దృష్టి సారిస్తాం. గ్రౌండ్‌నట్ రీసెర్చ్ సైంటిస్ట్‌గా అనుభవం ఉంది.

– ప్రసన్నరాజేష్, ప్రధానశాస్త్రవేత్త

# అధికారుల నిర్లక్ష్యంతోనే కుంగిన బ్రిడ్జి


పరిశీలిస్తున్న సీపీఎం నేతలు

**నెల్లూరు(వీఆర్సీసెంటర్):** వెంకటేశ్వరపురంలో ఫ్లైఓవర్ కుంగిన ఘటనలో అధికారుల నిర్లక్ష్యం కారణమని సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు ఆరోపించారు. ఫ్లైఓవర్ కుంగిన ప్రాంతాన్ని ఆదివారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ బ్రిడ్జిపై అనేక గుంతలు ఏర్పడ్డాయని, వీటికి మరమ్మతులు చేపట్టాలని ఉన్నతాధికారులను కోరినా, పట్టించుకోలేదని ఆరోపించారు. పనులను నాసిరకంగా చేపట్టడంతో ఈ దుస్థితి తలెత్తుతోందని పేర్కొన్నారు. ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నగర కమిటీ సభ్యుడు మూలం ప్రసాద్, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, జాఫర్, నేతలు బయ్యన్న, బాబు, రసూల్, గడ్డం శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఫెస్టివల్ కమిటీ ప్రమాణ స్వీకారం


మాట్లాడుతున్న నారాయణ

**నెల్లూరు(బృందావనం):** బారాషహీద్ దర్గా రొట్టెల పండగ ఫెస్టివల్ కమిటీ ప్రమాణ స్వీకారాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. కమిటీ చైర్మన్‌గా ఖాదర్‌బాషా మరో 70 మంది ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మంత్రులు నారాయణ, రామనారాయణరెడ్డి మాట్లాడారు. అందరూ సమన్వయంతో వ్యవహరించి రొట్టెల పండగను జయప్రదం చేయాలని కోరారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. తొలుత దర్గాలో బారాషహీదులను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం రొట్టెల పండగ పోస్టర్లను ఆవిష్కరించారు. ముఖ్యఅతిథులను ఘనంగా సత్కరించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, నేతలు అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, తాళ్లపాక అనూరాధ, సయ్యద్ సమీ హుస్సేనీ తదితరులు పాల్గొన్నారు.